సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనం ప్రారంభమెప్పుడో..?

బోథ్‌లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనం

బోథ్‌లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్నాయి. విద్యుత్ సౌకర్యం ఏర్పాటులో ఆలస్యంతో ప్రారంభోత్సవానికి నోచుకోలేక పోయింది. విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేసినా ఇంకా భవనాన్ని ప్రారంభించకపోవడంతో ప్రైవేట్ భవనంలో కార్యకలాపాలతో అద్దె రూపంలో ప్రజాధనం దుర్వినియోగమవుతున్నది. సంబంధిత శాఖ ఉన్నతాధికారులు కల్పించుకొని భవనాన్ని ప్రారంభించాలని బోథ్ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. -బోథ్, జూన్ 14

చదువుతోనే సమాజంలో విలువ

తాంసి, జూన్ 14 : నేటి సమాజంలో చదువుతోనే విలువ ఉంటుందని ఎంపీడీవో మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసంలో మండల విద్యాధికారి శ్రీకాంత్‌తో కలిసి హాజరయ్యారు. సరస్వతీ దేవి చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. అనంతరం విద్యార్థుల చేత అక్షరాలు దిద్దించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి, జూన్ 14: గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలోనే తమ పిల్లలను చదివించాలని ఉపాధ్యాయుడు లక్ష్మణ్‌రావ్ తల్లిదండ్రులకు సూచించారు. పిప్రి గ్రామంలోని ఆలయ అవరణలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు పలక బలపాలు అందించి అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో టీఏజీఎస్ జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు, ఉపాధ్యాయుడు మెస్రం సోనేరావ్, పంచాయతీ కార్యదర్శి కుర్సెంగా సూర్య, గ్రామ పటేల్ విజయ్‌పటేల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాలలే దేవాలయాలు

ఉట్నూర్ రూరల్, జూన్ 14: పిల్లలకు పాఠశాలలే దేవాలయాలని ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్ అన్నారు. ఘన్‌పూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా బడిలో చేరిన పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. ముందుగా సరస్వతీ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్

దస్తురాబాద్,జూన్14 : బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు కోటవేణు, పాఠశాల చైర్మన్ శీరిషా, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు విద్యార్థుల ఎంపిక

నర్సాపూర్(జీ), జూన్ 14: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న కోడె వేదగ్న, కదం అమర బోది, కేదేరావు ప్రదీప్, బాయమొల్ల రిశు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు కిషన్ రావ్ తెలిపారు. వీరికి తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రతి సంవత్సరం రూ.12వేలు అందుతాయని పేర్కొన్నారు.

తాంసి(భీంపూర్), జూన్ 14: పిప్పల్‌కోటి ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు మహేందర్, తేజస్విని, జ్ఞానిన్ నేషనల్ మిన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. దీనిపై హెచ్ఎం, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

మండలంలో భారీవర్షం

సారంగాపూర్, జూన్ 14: మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. రైతులు పత్తి విత్తనాలు విత్తుకోవడంతో కురిసిన వర్షానికి మొలకెత్తుతాయని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

చిన్నారికి ఆర్థిక సాయం

ఇంద్రవెల్లి, జూన్ 14 : డోంగర్‌గాం గ్రామానికి చెందిన భార్యభర్తలు అనక సంతోష్, స్వప్న ఇటీవల పిడుగుపాటుతో మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులతో పాటు తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారి అనక భానును శుక్రవారం అనక వంశీయులు పరామర్శించి విరాళంగా సేకరించిన రూ.24వేలు అందజేశారు. అలాగే తుడుందెబ్బ రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు పరామర్శించి రూ. 25వేలు ఆర్థిక సాయం అందించారు. తల్లిదండ్రులు కోల్పోయిన చిన్నారి అనక భానుకు అన్ని రకాల సహాయ సహకారం అందిస్తామని అనక వంశీయుల పెద్దలు,తుడుందెబ్బ రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో అనక వంశీయులు లంకు, పాండురంగ్, మాజీ ఎంపీటీసీ అనక హనుమంత్ రావ్, రామారావ్, వెంకట్‌రమణ, తుడుందెబ్బ రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు గోడం గణేశ్, నగేశ్, ఉయిక సంజీవ్, పుర్కా బాపురావ్, జుగ్నాక్ భరత్, బాజీరావ్, పుష్పరాణి, రేణుకాబాయి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్చోడ, జూన్ 14 : మండలంలోని బీసీ బాలికల వసతి గృహంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని వార్డెన్ కల్పన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నుంచి పదో తరగతి వరకు మొత్తం 52 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9652542851 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఫిజికల్ ఉపాధ్యాయుడిని నియమించాలి

ఇచ్చోడ(సిరికొండ), జూన్ 14 : సిరికొండ మండలం ఎంపీ యూపీఎస్ సోంపెల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఫిజికల్ టీచర్ నియమించాలని శుక్రవారం ఆదిలాబాద్‌లోని డీఈవో కార్యాలయంలో డీఈవో ప్రణీతకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ చంద్రకాంత్ మాట్లాడుతూ 6,7వ తరగతుల్లో 33 మంది ఉండగా పాఠశాలలో మొత్తం 106 మంది విద్యార్థులున్నారని, ఇక్కడ పని చేస్తున్న ఫిజికల్ టీచర్‌ను ఇటీవల వేరే పాఠశాలకు బదిలీ చేశారని అన్నారు. అతని స్థానాన్ని వెరిఫికేషన్ లిస్టులో చూపించలేదని, పాఠశాలకు ఫిజికల్ టీచర్‌ను నియమించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, తల్లిదండ్రులు మాణిక్‌రావ్, నాందేవ్, అముల్, జాకు, సుధాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

నార్నూర్, జూన్ 14 : పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థినులు అనారోగ్యం బారినపడకుండా ముందస్తు వైద్య పరీక్షలు చేస్తున్నామని వైద్యాధికారి రాంబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని జామాడ ఆదర్శ సైన్స్ బాలికల పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. 25 మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేశారు. జలుబు,దగ్గు, తల నొప్పి ఉన్న వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకుడు చౌహాన్ చరణ్‌దాస్, ప్రధానోపాధ్యాయుడు చౌహాన్ నెహ్రూ, పీడీ విశ్వనాథ్, వైద్య సిబ్బంది సింధు, బొజ్జుబాయి పాల్గొన్నారు.

పోచమ్మ విగ్రహం చోరీ

భీంపూర్, జూన్ 14 : భీంపూర్ మండల సరిహద్దు గ్రామం గుబిడిలోని పోచమ్మ గుడిలో అమ్మవారి విగ్రహాన్ని గురువారం రాత్రి దొంగలించారు. శుక్రవారం ఉదయం గమనించిన స్థానికులు గ్రామపెద్దలకు చెప్పారు. అమ్మవారి విగ్రహంపై ఉన్న వెండి కిరీటం కోసమే దుండగులు ఈ పని చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. కాగా అందిన ఫిర్యాదు మేరకు భీంపూర్ పోలీసులు శుక్రవారం గ్రామానికి వెళ్లి విచారణ చేశారు. వేలిముద్రలు సేకరించారు. గతంలో కూడా ఇక

కామాంధుడిని కఠినంగా శిక్షించాలి

భైంసా, జూన్ 14 : కాట్నపల్లిలో చిన్నారిపై లైంగికదాడికి పాల్పడి కిరాతకంగా చంపిన కామాంధుడిని కఠినంగా శిక్షించాలని గాంధీ బాల సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జాదవ్ పుండలిక్ రావు పాటిల్ కోరారు. ప్రభుత్వం కుటుంబాన్ని ఆదుకొని న్యాయం చేయాలని ఆయన కోరారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

సోన్, జూన్ 14: నిర్మల్‌లోని బంగల్‌పేట్ కాలనీకి చెందిన భూసాని రాజవర్ధన్ (35) మనస్తాపం చెంది సంగంపేట్ చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు హెడ్‌కానిస్టేబుల్ శంకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం...రాజవర్ధన్ తన కోడలు పెళ్లి చేయడంతో పాటు నిర్మల్‌లోని ల్యాబ్ పెట్టుకోవడంతో చేసిన అప్పులు ఎలా చెల్లించాలని, తన భార్య రెండు సంవత్సరాల క్రితం వదిలి వెళ్లిపోవడంతో మనస్థాపానికి గురయ్యాడు. గురువారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరి తిరిగి రాలేదు. శుక్రవారం మధ్యాహ్నం సంగంపేట్ చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

గోదావరిలో మునిగి యువకుడి మృతి

లోకేశ్వరం, జూన్ 14 : స్నేహితులతో సరదాగా స్నానం చేసేందుకు గోదావరి నదికి వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటన లోకేశ్వరం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పంచగుడి గ్రామానికి చెందిన రాపతి భోజయ్య (28) గురువారం సాయంత్రం మిత్రులతో కలిసి పంచగుడి బ్రిడ్జి సమీపంలో గోదావరి నదిలోకి స్నానానికి వెళ్లాడు. నదిలోని నీటి లోతును అంచనా వేయకుండా స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. స్నేహితుల సమాచారంతో కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి వెళ్లి అక్కడి మత్స్యకారులతో గాలించినా ఫలితం లేకపోవడంతో లోకేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఎస్ఐ మత్స్యకారులతో గాలింపు చేపట్ట డంతో మృతదేహం లభ్యమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

PUBLIC NOTICE

General public are hereby informed that my client **M/S Shriram Finance Pvt. Ltd. Nirmal** agreed to accord loan to **Sri.Mohammed Abdul Nazeeb,** S/o. Mohammed Abdul Aziz R/o H.No.1-81, Sathanpally village of Khanapur Mandal, and Dist. Nirmal by mortgage of the schedule referred property. The above pros pective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of what soever nature may put forth their claims before me within **(7) days** of this notice. The objections are raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property. Hence this notice

SCHEDULE PROPERTY

The dismantled house No.2-69, its admeasuring area:1628.00 Sq.fts equal to 180.88 sq.yds equal to 151.24 Sq.mtrs. situated at Sathan pelli Village of Khanapur Mandal, District Nirmal, within the limits of Registration Sub Dist Khanapur and Registration Dist. Adilabad. North: Open place of Shekar Reddy, South: Basara to Mancherial P.W.D. Road, East: House of Aziz Khan West: Open Place of MD.Parvezkhan.

Sd/- Dr.S.LINGAIAH, Advocate
Gollapet Street, Nirmal,Cell: 9912604136

రక్తదానానికి ముందుకు రావాలి

- ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్
- పలు చోట్ల రక్తదాన శిబిరాలు

ఎదులాపురం, జూన్ 14 : రక్తదానంపై అపోహలు వీడి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్, డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ సూచించారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలోని రిమ్స్ రక్తనిధి కేంద్రంలో పలు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ముందుగా రిమ్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ తిరుమల్ రెడ్డి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం నిండు ప్రాణాన్ని నిలబెడుతుందన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సిరాజ్‌ఉద్దీన్, బాలశంకర్, పెద్దివార్ శశికాంత్, అనిల్‌లో కండే, ఇమ్రాన్‌ఖాన్, అస్లాం, తెలంగాణ వైద్య ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండారి కృష్ణ, అల్లాడి రఘురాం పాల్గొన్నారు.

ఎదులాపురం: రక్తదాన శిబిరంలో డీఎంహెచ్‌వో, డైరెక్టర్లు

భైంసా, జూన్ 14 : పట్టణంలోని మహేశ్వరి ప్రగతి మండల్ ఆధ్వర్యంలో మార్వాడీ భవన్‌లో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. మహిళలు, పలువురు రక్తదానం చేశారు. కార్యక్రమంలో మార్వాడీ సంఘ సభ్యులు, డాక్టర్ ప్రవీణ్, మురారి, శ్యామల, అశోక్ లడ్డా, శీతల్ ధరక్, జ్యోతి, విష్ణు, ఉజ్వల, శ్రీకాంత్, కపిల్, పురుషోత్తం, సురభి, నర్సింగ్, గోవింద్, నరేశ్, అశుతేశ్ పాల్గొన్నారు.

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 14 : యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని నిర్మల్ డీఎంహెచ్‌వో ధన్‌రాజ్ అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా నిర్మల్ ప్రభుత్వ వైద్య కళాశాల దవాఖానలోని బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. సిబ్బంది, స్టాఫ్‌నర్సులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి రాజేందర్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, బ్లడ్ బ్యాంకు ఇన్‌చార్జి డాక్టర్ మాధవి, పీవో డా. శ్రీనివాస్, డా.వేణుగోపాలకృష్ణ, డా.దశరథ్, డా.చైతన్య, నర్సింగ్ సూపరింటెండెంట్లు కమలమ్మ, విజయలక్ష్మి, సిబ్బంది నవీన్, రాకేశ్ పాల్గొన్నారు.

భైంసాలో రక్తదానం

భైంసా : రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న మార్వాడీ సంఘ సభ్యులు

నిర్మల్‌చైన్‌గేట్: రక్తదాన శిబిరాన్ని సందర్శిస్తున్న డీఎంహెచ్‌వో, అధికారులు

బోథ్ ఏఎంసీ సమావేశం

మాట్లాడుతున్న వైర్మన్ బొడ్డు గంగారెడ్డి

బోథ్, జూన్ 14 : బోథ్ మార్కెట్ కమిటీ సాధారణ సమావేశం శుక్రవారం చైర్మన్ బొడ్డు గంగారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మార్కెట్ కమిటీ పరిధిలోని పొచ్చెర గోదాం చుట్టూ గోడ నిర్మాణం చేపట్టడానికి సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. ప్రధాన రోడ్డు వైపు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, ఓపెన్ షెడ్డు నిర్మాణానికి సైతం తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి శ్రీనివాస్, వైస్ చైర్మన్ వసంత్‌రావ్, ప్రత్యేక శ్రేణి కార్యదర్శి మనోహర్, జేఎంఎస్ స్వామి, సభ్యులు పాల్గొన్నారు.

ఖానాపూర్ వాసికి అరుదైన గౌరవం

రాజ్‌కుమార్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న సిగ్మా అకాడమీ వైర్మన్ శేఖర్

ఖానాపూర్, జూన్ 14: ఈ నెల 6 నుంచి 11వ తేదీ వరకు సిగ్మా ఆకాడమీ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా నిర్వహించిన ఫొటోగ్రఫీ వర్క్‌షాపు టాలెంట్ పరీక్షల్లో ఖానాపూర్ వాసికి అరుదైన బిరుదు లభించింది. హిమాచల్‌ప్రదేశ్‌లో నిర్వహించి ఈ ప్రతిభ పోటీల్లో పలు రాష్ట్రాల నుంచి ఫొటోగ్రాఫర్లు పాల్గొనగా ఖానాపూర్ మండలంలోని సుర్జాపూర్ గ్రామానికి చెందిన బీ రాజ్‌కుమార్ బ్రోజ్న్ మోడల్‌తో పాటు ప్రశంసాపత్రం లభించినట్లు ఆయన పేర్కొన్నారు. సిగ్మా ఆకాడమీ చైర్మన్ ఎంసీ శేఖర్ తనకు ఈ పత్రం అందించారన్నారు. ఆయనను ఖానాపూర్, కడెం, పెంబి మండలానికి చెందిన ఫొటోగ్రాఫర్లు, స్థానికులు అభినందించారు.

నగర సంకీర్తనతో పరిరక్షణ

ఎదులాపురం, జూన్ 14 : ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేసిన నగర సంకీర్తన కార్యక్రమం 14 వసంతాలు పూర్తి చేసుకుంది. 2010వ సంవత్సరంలో ప్రారంభమైన నగర సంకీర్తన కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ప్రతి రోజూ వేకువజామున పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి ప్రారంభమయ్యే నగర సంకీర్తన హనుమాన్ మందిరం, మంగ మఠం, శ్రీ రామచంద్ర గోపాల కృష్ణ మఠంతో పాటు ప్రముఖ ఆలయాల గుండా తిరిగి వేంకటేశ్వర స్వామి ఆలయానికి చేరుకుంటుంది. ఈ సందర్భంగా సభ్యుడు బండారి దేవన్న మాట్లాడుతూ నగర సంకీర్తనతో ధర్మ పరిరక్షణతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కమల కిశోర్ అగర్వాల్, మహేశ్ ఖేతన్, దామోదర్, పవన్, అగర్వాల్, రాంకిషన్, విజయ్ పాల్గొన్నారు.

బ్లాంకెట్లు అందజేత

లక్ష్మణచాంద, జూన్ 14: పీచర గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో వరల్డ్ విజన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎస్ఐ సుమలత శుక్రవారం విద్యార్థులకు బ్లాంకెట్లు అందజేశారు. ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వరల్డ్ విజన్ సంస్థ మేనేజర్ బ్రహ్మన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాంగ్ సమాజ అభ్యున్నతికి కృషి చేస్తాం

ఎదులాపురం, జూన్ 14 : మాంగ్ సమాజ అభ్యున్నతికి కృషి చేస్తామని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మాజీమంత్రి జోగు రామన్న గతంలో పిట్టలవాడలో 16 గుంటల స్థలంతో పాటు రూ.20లక్షలు మంజూరు చేశారు. శుక్రవారం మాంగ్ సమాజ్ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే పాయల్ శంకర్, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ముందుగా లహుజీ సాల్వే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, అన్నబావు సాఠే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే ప్రహ్మానంద్, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు భట్లాడే సూర్యకాంత్, కౌన్సిలర్లు భరత్‌కుమార్, రఘుపతి, నాయకులు డీకే జ్ఞానోబా, మాధవ్, మధుకర్, అస్తక్ సుభాష్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్

మాజీ మంత్రి జోగు రామన్నకు ప్రత్యేక ధన్యవాదాలు

మాంగ్ సమాజ అభివృద్ధికి అన్ని విధలుగా సహకారాన్ని మాజీ మంత్రి జోగు రామన్న అందించారని అన్నభావు సాఠే అసోసియేషన్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు కాంబ్లే ఉద్దవ్, నాందేవ్ తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే మాంగ్ సమాజ్ భవన నిర్మాణానికి స్థలం, రూ.20లక్షలు కేటాయించిందన్నారు.

ఉపాధ్యాయుడిని హత్య చేసిన నిందితులను ఉరి తీయాలి

నార్నూర్, జూన్ 14 : ప్రభుత్వ ఉపాధ్యాయుడిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించి ఉరి తీయాలని ఆయా సంఘాల నాయకులు, యువకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రం నుంచి తహసీల్ కార్యాలయం వరకు ర్యాలీ వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభం రోజున గాదిగూడ మండలం అర్జుని గ్రామ పంచాయతీ పరిధిలోని కొలాంగూడ గ్రామ సమీపంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు జాదవ్ గజానంద్‌ను దారుణంగా హత్య చేసిన నిందితులకు ఉరిశిక్ష పడేలా కఠినమైన చర్యలు తీసుకోవాలని సీఐ రహీం పాషాను కోరారు. అంతకుముందు డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాథోడ్ జాలింధర్, మాజీ సర్పంచ్ రాథోడ్ సావీందర్, అర్జున్, జితేందర్, రమేశ్, దత్త, రోహిదాస్, మోహన్, స్వరాజ్, అజయ్, గణేశ్ పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారులు క్షేత్ర సందర్శన చేయాలి

కుంటాల, జూన్ 14 : ఈ వానకాలంలో పత్తి, సోయా తదితర పంటల విత్తనాలు వేస్తున్న సమయంలో వ్యవసాయ అధికారులు రోజువారీగా క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండి రైతులకు తగిన సూచనలు, సలహాలు అందించాలని డీఏవో అంజిప్రసాద్ సూచించారు. శుక్రవారం కుంటాల మండలం కల్లూరు రైతు వేదికలో ఏవోలు, ఏఈవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏడీఏ విద్యాసాగర్, ఏడీఏ వీణ, భైంసా, ముథోల్, కుంటాల మండలాల ఏవోలు, ఏఈవోలు పాల్గొన్నారు.

పుల్గంపాండ్రి-సిరిచెల్మ రోడ్డు ఏర్పాటు చేయాలి

ఎంపీ నగేశ్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రజలు

పెంబి, జూన్ 14 : పెంబి మండలం పుల్గంపాండ్రి-సిరిచెల్మ, పసుపుల-రాసిమేట్ల, మందపల్లి-రాజురా రోడ్డు ఏర్పాటుతో పాటు దొత్తి వాగుపై, పస్పుల వద్ద కూలిపోయిన వంతెన నిర్మించాలని మండల వాసులు శుక్రవారం ఆదిలాబాద్ ఎంపీని కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అటవీ శాఖ అనుమతులు ఇవ్వకపోవడంతోనే మారుమూల గ్రామాలకు రోడ్డు పనులు నిలిచిపోతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సిరిచెల్మ రోడ్డుతో పాటు గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించడానికి కృషి చేయాలని కోరారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్

ఉట్నూర్ రూరల్, జూన్ 14: ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యదవ రావ్, నాయక్‌పోడ్ సంఘం జిల్లా అధ్యక్షుడు జనగ భీముడు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఇక్కడ నాయకులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పెంబి, జూన్ 14 : సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జడ్పీ సీఈవో గోవింద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. వాగుల అవతల గ్రామాల్లోని గర్భిణులు ప్రసవానికి 4-5 రోజుల ముందే వాగులు దాటి రావాలని సూచించారు. ఆనంతరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పలు రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమాకాంత్, ఎంపీవో రత్నాకర్ రావు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

నిర్మల్ అర్బన్, జూన్ 14 : విద్యుత్ ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ నిర్మల్ సర్కిల్ పరిధిలో జీరో విద్యుత్ ప్రమాదాల లక్ష్యంగా అధికారులు పూర్తి స్థాయిలో చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ప్రధానంగా భద్రతపై నిర్లక్ష్యం, అవగాహన లోపం, విద్యుత్ వినియోగదారుల గృహాల్లో నాణ్యమైన వైరింగ్ లోకపోవడం, నాసిరకం విద్యుత్ పరికరాలు వాడడం, రైతులు మోటర్ స్టాటర్ బోర్డుల వద్ద ఎర్తింగ్ పాటించక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. వీటిపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

విద్యుత్ షాక్‌తో బర్రె మృతి

సోన్, జూన్ 14: సోన్ మండలం జాప్రాపూర్ గ్రామంలో అందెడి సాయారెడ్డి అనే రైతుకు చెందిన బర్రె విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. గ్రామంలోని తన పాక వద్ద ఎర్తింగ్ వైర్ తగిలి మృతి చెందినట్లు తెలిపారు. దీని విలువ సుమారు రూ. 80వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

లక్ష్మణచాంద, జూన్ 14 : కనకాపూర్ గ్రామంలో దోడ సాయవ్వకు చెందిన బర్రె శుక్రవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. బాధిత మహిళ దోడ సాయవ్వ వివరాల ప్రకారం.. ప్రతి రోజూ మాదిరిగానే మేత మేయడానికి బర్రెను మందలోకి పంపారు. మధ్యాహ్న సమయంలో మేతమేస్తూ వెళ్లి తెగిపడిన కరెంట్ తీగకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. బర్రె విలువ రూ.60 వేలు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం తనకు సహాయం అందించి ఆదుకోవాలని ఆమె కోరారు.

శాంతి భద్రతలు కాపాడాలి

కుంటాల, జూన్ 14 : మండలంలోని ప్రజలు శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని భైంసా రూరల్ సీఐ ఎం నైలు అన్నారు. శుక్రవారం కుంటాల పోలీస్ స్టేషన్‌ను ఆ